


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## నిజామాబాద్ కామారెడ్డి



ఆదివారం 5 జనవరి 2025 5 పేజీలు


# కామారెడ్డి కలకలం తీరినట్టేనా...!

## -కొందరి పోలీసుల తీరుతో అప్రతిష్టపాలు




**సూర్య, కామారెడ్డి క్రైం**

కామారెడ్డి లో జరిగిన కలకలం ఘటనపై ఇంకా సస్పెన్షన్ కొనసాగుతుంది. పోలీసు శాఖకు చెందిన ఇద్దరు మరణాలు రాష్ట్ర వ్యాప్తంగా సంచ లనం సృష్టించాయి. అయితే పోలీసు శాఖలో జరిగిన ఈ ఘటన ఒక్కసారిగా కామారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రంలో సంచలనంగా నిలిచింది. అయితే మొదటి నుంచి కేసును చేదించడంలో కామారెడ్డి పోలీసులు పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. కామా రెడ్డి జిల్లా ఎస్పీ ఆద్వర్యంలో ప్రత్యేక విచారణ అధికారులను సైతం నియమించారు. ఇప్పటికే విచారణ బృందం పోలీసు అధికారులు వివిధ కోణాల్లో ధర్యాప్తు ముమ్మరం చేశారు. కాగా చెరువులో పడి మృతి చెందిన ముగ్గురికి సంబంధించిన ఫోన్ కాల్ డేటా తదితర వివరాలను అధికారులు సేకరించి కొంత నిర్ధారణకు వచ్చారు. అప్పటి వరకు వచ్చిన కొన్ని ఊహ వార్తలను జిల్లా ఎస్పీ తప్పుబట్టారు. ఆ ఘటనలో మృతి చెందిన ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శృతి, నిఖిల్ కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని మానవీయ కోణంలో చూస్తూ కేసును చేదించే పనిలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా వారి సొంత గ్రామాల్లో విచారణ బృందం ఇప్పటికే వివరాలను సేకరించారు. ఏది ఏమైనప్పటికీ ఆ ముగ్గరి మరణంతో పోలీసు శాఖలో ఒకేసారి తీవ్ర అలజడి నెలకొంది. ఏది ఏమైనా ఆ ముగ్గురి మరణాలతో వారి కుటుంబాల్లోనూ తీవ్ర వుషాదస చాయలు అలుముకున్నాయి. కాగా కేసు వివరాలను పూర్తిగా కొలిక్కి రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉండనున్నట్లు సమాచారం. (మిగతా 2లో)

# తింటే తిప్పలే.....!!

- హొటళ్ళు, రెస్టారెంట్లు, పాస్ట్ ఫుడ్ సెంటర్లు నిర్వహణ అస్తవ్యస్తం
- నిఘా లేదు,నియంత్రణ కరువు



**సూర్య, భీమ్‌గల్**

విభిన్నమైన పదార్థాలు, ఆకర్షించే రంగులు,తాజాగా కనిపించే ఆహార పదార్థాలు, ఇలాంటి వాటిని చూసి తిని తృప్తిపడా లనుకునేవారికి చేదు అనుభవమే మిగులుతుంది. పట్టణంలో హొటల్లో, రెస్టారెంట్స్ లో,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో నిల్వ చేసిన పదార్థాలతో భోజనాలు తయారు చేస్తున్నారని,వీటిని తింటు న్న జనాలు అనారోగ్యం బారినపడుతున్నారని , నాణ్యత ప్రమాణాలు తరుచూ తనిఖీ చెయ్యాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవరించడం వల్లనే ఈ పరిస్థితి అని విమర్శలు వస్తున్నాయి.

### – దోసలో బొద్దింక

భీమ్‌గల్ పట్టణంలోని హొటల్స్ నిర్వాహకులు శుభ్రతను గాలికి వదిలేశారు. కొన్ని హొటల్స్ కి కనీసం బోర్డులు లేవంటే మున్సిపల్ అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. టిఫిన్ తయారు చేసే పాత్రలు, తినే ప్లేట్స్ కూడ శుభ్రంగా ఉంచకపోవడం కొన్ని హొటల్స్ కి ఇక్కడ ప్రత్యేకత. తాజాగా నిన్న ఒక వ్యాపారి బస్టాండ్ లో గల ఒక హొటల్ నుండి శనివారం టిఫిన్ చేసేందుకు దోస పార్సెల్ తెప్పించుకోగా అందులో బొద్దింక కనిపించింది. ఈ విషయం హొటల్ యజమాని దృష్టికి తీసుకెళ్లగా టిఫిన్ కొరకు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేసాడు.తనిఖీలు నిర్వహించాలి.పట్టణంలోని హొటల్స్, రెస్టారెంట్స్,దాబా, టిఫిన్ సెంటర్స్, మండీ బిర్యాని, బార్ తదితర వాటిల్లో ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలు నిర్వహించాలనీ డబ్బులు తీసుకొని రోగాల బారిన పడే ఫుడ్ విక్రయిస్తున్న వీరిపై అధికారులు చర్యలు తీసుకోవాలనీ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో

# ప్రాణాలను బలి తీసుకుంటున్న మూలమలుపు

**సూర్య - నవీపేట్**

మండలం మీదుగా నిర్మల్ జిల్లా బాసరకు ప్రయాణం ప్రమాదక రంగా మారింది ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయా ల్సి వస్తుంది.ప్రమాదకర మూల మలుపు వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.రోడ్డు మూల మలుపు వద్ద ఖాళీగా ఉన్న స్థలంలో పంచాయతీ అధికారులు చెత్తను వేసి డంపింగ్ యార్డ్ గా మార్చి చెత్తకునిప్పండించడంతో పొగ రోడ్డుపై వ్యాపించి ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కనిపించకపోవడంతో పాటు ఆర్ అండ్ బి అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపో వడంతో నిత్యము ప్రమాదాలు (మిగతా 2లో)





## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు

# పటిష్ట చర్యలు తీసుకోవాలి

**- రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.**

- రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలి
- జిల్లా హెడ్ క్వార్టర్ లో పిల్లలచే రొడ్డు భద్రతా ప్రమాణాలపై భారీ ర్యాలీ.
- గురుకులాలో పిల్లలకు అందించే ఆహార నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలి.
- రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహన పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి పొన్నం ప్రభాకర్.

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి**




రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహిం చాలని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ అన్నారు.



శనివారం రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నుంచి రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ తో కలిసి రోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణ పై జిల్లా కలెక్టర్లు, ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. (మిగతా 2లో)

# కామారెడ్డి కలకలం తీరినట్టేనా...!

**(మొదటి పేజీ తరువాయి)**

సమాజాన్ని కుటుంబంలా రక్షించాల్సిన పోలీసుశాఖ కొందరి అధికారుల తీరుతో అప్రతిష్టపాలుకు గురవుతుందని విమర్శలు మొదలయ్యాయి. సమాజాన్ని రక్షించాల్సిన పోలీసు శాఖ అధికారులు ఈ మధ్యలో లింగంపేట్ తో పాటు ఆయా స్టేషన్లలో పని చేసే వారు అవినీతి నిరోధకశాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. ఇటువంటి సంఘటనలు పోలీసు శాఖను తీవ్రమైన అప్రతిష్టపాలు చేసేలా కొందరి పోలీసు అధికారుల తీరు ఉండడం కారణమవుతుంది. సమాజంలో శాంతి భద్రతల కోసం కృషి చేయాల్సిన వారు ఇలా వ్యవహరించడం సామాన్య ప్రజలు హర్షించడం లేదు. ఏది ఏమైనా కొందరి పోలీసు అధికారుల తీరుతోనూ ప్రజలు విసుగు చెందుతున్నారు.

**-పోలీసుల దురుసు ప్రవర్తన...!**

కామారెడ్డి జిల్లాతో పాటు ఆయా పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించే పోలీసు శాఖ అదికారుల దురుసు ప్రవర్తనపై గతంలోనూ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయితే గత మూడు నెలల క్రితం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పర్యటించిన సమయంలో కామారెడ్డి కలెక్టరేట్ వేదికగా వివిధ ప్రజా సంఘాల నాయకులు ఈ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్లలో దురుసుగా వ్యవహరిస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. ఇటువంటి అనేక ఉదాహరణలను సైతం అక్కడక్కడ ప్రజలు చర్చించుకుంటున్నారు.

**- కామారెడ్డి డీఎస్పీపై ఫిర్యాదు**

కామారెడ్డి డీఎస్పీగా విధులు నిర్వహించిన నాగేశ్వరరావు పై ఇటువంటి దురుసు ప్రవర్తన విషయమై ఫిర్యాదు లు తలెత్తాయి. ఏకంగా కొంత మంది జర్నలిస్టులు ఉన్నత స్థాయి పోలీసు అధికారికి సదరు డీఎస్పీపై ఫిర్యాదు చేశారు. కాగా కారణం ఏదైనా ప్రస్తుతం అతనిని బదిలీ చేశారు. ఇటువంటి అనేక సంఘటనలతో ప్రజలు, పోలీస్ స్టేషన్ కు వచ్చే వారు తీవ్రమైన అసహనానికి గురవుతున్నారు. గౌరవప్రదమైన బాద్యతల్లో ఉండి నిత్యం సమాజంలో శాంతి కోసం కృషి చేసే పోలీసు శాఖలో కొందరి తీరు వల్ల నమ్మకం సన్నగిల్లే పరిస్థితులు నెలకొన్నాయి. ఏది ఏమైనా శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేసే పోలీసులకు పౌరులుగా ప్రజలు సైతం సహకరిస్తూ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ., గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేదని, దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని నేడు రోడ్డు భద్రతా మాసోత్సవం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి శాఖను భాగస్వామ్యం చేస్తూ విస్తృతంగా ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల పై వేడుకలను ప్రతి గ్రామంలో జరగాలని అన్నారు. పిల్లల్లో రోడ్డు భద్రతా ప్రమాణాల పై అవగాహన కల్పించేందుకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులచే ప్రతి జిల్లా , మండల హెడ్ క్వార్టర్ లో భారీ ర్యాలీ చేపట్టాలని అన్నారు. ఆర్%డ% బీ, పంచాయతీ రాజ్ శాఖ తమ పరిధిలో రోడ్డు భద్రతా ప్రమాణాల కార్యక్రమాలు జరగాలని అన్నారు. రవాణా శాఖ, పోలీస్ శాఖ, విద్యాశాఖ, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు భద్రత కార్యక్రమాలు విజయవంతం చేయాలని అన్నారు. భారీ తుఫాన్లు, వరదలు, రోగాల వల్ల పోయే ప్రాణాల కంటే ప్రమాదంలో అధికంగా ప్రాణాలు కోల్పోతున్నామని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు మనమంతా కలిసి పని చేయాలని అన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను పిల్లల పాఠ్యాంశం లో కూడా పెట్టేలా చూస్తామని అన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించని వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసి భవిష్యత్తులో జారీ చేసేందుకు వీలు లేకుండా సాఫ్ట్వేర్ రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామని, ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల కార్యక్రమాలకు విస్తృత ప్రచారం ఉండాలని, స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహన కార్యక్రమాల్లో హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ వినియోగించేలా ప్రోత్సహిస్తూ కొంతమందికి హెల్మెట్ పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. మహిళల ప్రయాణికుల సంఖ్య పెరిగిన మార్గాలలో బస్సులు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రతా కార్యక్రమాలను ముందుండి నిర్వహించాలని, పాఠశాలలో రోడ్డు భద్రత ప్రమాణాలపై పోటీ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో పిల్లలకు మెస్ చార్జీలు పెంచామని, వారికి రుచికరమైన నాణ్యమైన ఆహారం అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లలకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను కలెక్టర్లు , ఉన్నతాధికారులు తనిఖీ చేయాలని, నిత్యావసర సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు త్వరగా చెల్లిస్తున్నామని , నాణ్యత అంశంలో ఎక్కడ రాజీ ఉండవద్దని అన్నారు. రోడ్లు భవనాల శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ మాట్లాడుతూ, జనవరి నెల మొత్తం రోడ్డు భద్రత ప్రమాణాల కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు తెలిపారు. ప్రస్తుత సమాజంలో జరిగే రోడ్డు ప్రమాదాలలో 75% డ్రైవర్ తప్పుల వల్ల జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలు, పాటించాల్సిన నియమ నిబంధనల పై అవగాహన కల్పించాలని అన్నారు. రోడ్ల పై ప్రమాదాలు జరిగినప్పుడు అంబులెన్స్ ఏ ఆసుపత్రికి తీసుకుని రావాలి ఒక ప్రణాళిక ఉండాలని, దీని పై అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రతి జిల్లా స్థాయిలో ఉన్న రోడ్ సేఫ్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించి, ఆక్సిడెంట్ ప్రోన్ ఏరియా గుర్తించాలని, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి పాఠశాల పరిసరాలలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు చిన్నతనం నుంచి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన ఉండాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై లోకల్ ఎఫ్.ఎం రేడియో, కేబుల్ చానల్స్ లో టెలికాస్ట్ అయ్యేలా చూడాలని అన్నారు. రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ రోడ్లు, జాతీయ రహదారుల్లో అవసరమైన సైన్ బోర్డులు ఉండేలా జిల్లా రవాణా శాఖ అధికారి పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ., రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా విస్తృతంగా జిల్లా ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు,రంగోలి, వ్యాస రచన పోటీలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక సారథుల చే గ్రామ గ్రామాన పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను అంబులెన్స్ లో ఏ ఆసుపత్రికి తీసుకవెళ్లలో తెలిపే విధంగా ఆసుపత్రుల వివరాల బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు. జిల్లాలో బ్లాక్ స్పాట్ లను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని హాస్పిటల్ లో వైద్య సౌకర్యాలు ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలనీ తెలిపారు. జాతీయ రహదార్లు, ఆర్.టీ.సి. లలో కంటి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ట్రాఫిక్ రూల్స్ తెలిపే విధంగా సైన్ బోర్డులు ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. చంద్రశేఖర్, జిల్లా విద్యా శాఖాధికారి రాజు, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో లూయిస్ బ్రెల్ 216 వ జన్మదిన వేడుకలు

**- బ్రెయిలీ లిపి లో ప్రచురించిన బ్రేల్ క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



అంధుల కోసం లూయిస్ బ్రేల్ ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిని కనుగొన్న అక్షర ప్రధాత అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లో లూయిస్ బ్రెల్ 216 వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటం ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంధుల సౌకర్యార్థం విద్యను అభ్యాసించుటకు బ్రెయిలీ లో అక్షరాలను కనుగొన్న వ్యక్తి అని అన్నారు. దివ్యంగులకు, అంధులకు ప్రభు త్వం చేయూత నిస్తున్నదని తెలిపారు. ఎన్నికల్లో అంధులు తమ ఓటు హక్కు వినియోగించు కొనుట కు బ్రెయిలీ లిపి లో బ్యాలెట్ పేపర్ ను కూడా ఎన్నికల కమీషన్ ఏర్పాటుచేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుం టామని తెలిపారు. అనంతరం తెలంగాణా రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ వారిచే బ్రెయిలీ లిపి లో ప్రచురించబడిన బ్రేల్ క్యాలెండర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, సి.డి.పి.ఒ. రోచిష్మ , దివ్యంగుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో ప్రాణాలను బలి తీసుకుంటున్న మూలమలుపు..

**(మొదటి పేజీ తరువాయి)**



జరుగుతున్నాయి. బాసర నుండి వచ్చే వాహనచోదకులు రెండు వరుసల రోడ్డు కావడంతో వేగంగా వెళ్తున్నారు. ఈ మూల మలుపు వద్దకు రాగానే రెండు వరుసల రోడ్డు కాస్త ఒక వరుస రోడ్డుగా మారడంతో వాహనచో దకులు వాహనాల వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఆర్ అండ్ బి అధికారులు మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శుక్రవారం రాత్రి ఈ మూలమలుపు వద్ద లారీ ద్విచక్రవాహనం ఢీకొని కోస్లి (ఫకీరాబాద్) గ్రామానికి చెందిన భార్యాభర్తలు ప్రమాద స్థలంలోని మృతి చెందారు. ఈ ప్రమాదం వల్ల ఒక కుటుంబం కుటుంబ పెద్దలను కోల్పోయి దిక్కు తోచని స్థితిలో రోడ్డున పడింది.రెండు వరుసల రోడ్డు కావడంతో వాహనదారులు అడ్డు అదుపు లేకుండా స్పీడ్ గా వెళ్తుండడంతో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుం టున్నాయి. ఈ రోడ్డుపై రోజు వేల వాహనాలు తిరుగుతుంటాయి కాబట్టి ఆర్ అండ్ బి అధికారులు ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని. రాష్ట్ర ప్రభుత్వం లక్షల వ్యయంతో నిర్మించిన డంపింగ్ యార్డులు ఉండగా పంచాయతీ అధికారులు చెత్తను తీసుకొచ్చి మూలమలుపుకు ఇరువైపుల వేయడం ఏమిటని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగి ప్రయాణికుల ప్రాణాలు పోతే తప్ప అధికారులు స్పందించడం లేదని ఆరోపణలు ఉన్నాయి కాబట్టి సంబంధిత అధికారులు అవసరమైన చర్యల ను చేపట్టి ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించి సూచికలు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తే రహదారులు మృతి మార్గాలుగా మారకుండా ఉంటా యని ప్రజలు కోరుతున్నారు.

## R & B అధికారులతో సమీక్షా నిర్వహించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి 22:**



సుభాష్ నగర్ అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో R&B అధికారులతో అర్బన్ శాసన సభ్యులు ధన్ పాల్ సూర్యనారా యణ సమీక్షా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నగరంలో పెండింగ్ లో ఉన్న పలు అభివృద్ధి పనులపైన అధికారులతో చర్చించి తగు సూచనలు తెలుపడం జరిగింది.నాగారం,కలెక్టరేట్ బైపాస్ లో నిర్మించిన 648 డబుల్ బెడ్ రూమ్ ల మరమ్మతులకు ఇటీవల ప్రభుత్వం నుండి విడుదల అయినా 1.25 కోట్లతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బ్లాక్ వైస్ విభజించి వీలైనంత త్వరగా మరమ్మతులు ప్రారంభించి పనులు పూర్తి చేయాలనీ సూచిం చారు.నగరంలో వర్ని రోడ్ నుండి నాగారం వరకు,బస్వాగార్డెన్ రోడ్, రాజీవ్ గాంధీ సర్కిల్ నుండి దత్తాత్రేయ గుడి వరకు మంజురైనా నాలుగు రోడ్ల నిర్మాణం, దత్తాత్రేయ గుడి బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలనీ పనులు నాణ్యతతో చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పని చేయాలనీ సూచించారు.నగరంలో రోడ్ మరమ్మతులు జరగడం లేదని గుంతలు పడ్డ రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు, నగరంలో గుంతలు పుడ్చాలని అదేశించారు.

## ఏరియా ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణ కేంద్రంలో రూ.37.50 కోట్లతో నూతనంగా నిర్మించే 100 పడకల ఏరియా ఆసు పత్రి భవన నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శనివారం పరిశీంచారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై కాంట్రాక్టరుతో వివరాలు తెలుసుకొని నాణ్యత లోపం లేకుండా నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, స్థానిక ప్రజా ప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

# అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన చీకటి సూర్యుడు లూయి

## - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



కలెక్టర్ బైపాస్ స్నేహ సొసైటీలో నిర్వహించిన లూయి బ్రెయిలీ 216వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా ఇందూర్ లిఅర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.లూయి విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించడం జరిగింది అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు...చెప్పులు కుట్టే కుటుంబంలో జన్మించి,రెక్కడితే కాని కడుపు నిండని పరిస్థితుల్లో చిన్న వయసులో ప్రమాదవాషత్తు కంటి చూపు కోల్పోయిన చదువుకోవాలనే తపనే ఈ రోజు ప్రపంచం గర్వించదగ్గ మహోన్నత శక్తిగా ఏదిగిన వ్యక్తి లూయి అని కొనియాడారు. అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన చీకటి సూర్యుడు లూయిస్ బ్రెయిలీ అని తనతో పాటు తోటి అంధులైనవారి జీవితాల్లో వెలుగులు నింపాలనే తపనతో అంధుల కోసం ప్రతేక లిపిని నిర్మించడం జరిగిందని అన్నారు.బ్రెయిల్ లిపిని అందించి అంధులకు విద్య ప్రధానం చేసిన మహనీయుని దినోత్సవాన్ని జనవరి 4 ప్రపంచ బ్రెయిల్ దినోత్సవంగా మనం ఈ రోజు జరుపుకోవడం చాలా సంతోషకరం అన్నారు. అటువంటి మహనీయుడు బ్రతికిఉన్నప్పుడు అతని లిపిని గుర్తించలేదని చనిపోయిన తరువాత గుర్తించిన, ఆధునిక ప్రపంచానికి అనుగుణంగా బ్రెయిల్ లిపిని అభివృద్ధి చేసి అంధులందరికి ఉచితంగా విద్య అందించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవం అన్నారు.విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు విద్యార్థులందరు కూడా లూయి ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయిలో నిలవాలని అన్నారు నేడు వివిధ ప్రభుత్వ శాఖల్లో అంధులు ఉద్యోగాలు చేస్తున్నారు అంటే ఆనాడు లూయి అందించిన లీపి అని గుర్తు చేసారు, పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్న సంకల్పం గట్టిగ ఉంటే అనుకున్న లక్ష్యం తప్పకుండ చేరుకుంటాం కాబట్టి మీరు ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని రాణించాలని సూచించారు.కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వల నుండి తగిన సహాయ సహకారాలు అందేవిదంగా కృషి చేస్తానని అంధుల హక్కులైన విద్య , వైద్యం అందించే దిశగా ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ స్కూల్ సెక్రటరీ,సిద్దయ , రసూల్.బి ,ప్రభుత్వం ఆసుపత్రి సూపరిండెంట్ ప్రతిమరాజ్ , తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచకుంటే సమ్మెకు సిద్ధం

## - సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

**సూర్య కామారెడ్డి**



మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచకుంటే నిరవధిక సమ్మెకు దిగుతాం సిఐటియు జిల్లా కార్యదర్శి కే చంద్రశేఖర్ అన్నారు. కార్మికులు చేస్తున్న ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత ఉంటుందంటే వారు పనులు మానివేస్తే కామారెడ్డి మున్సిపాలిటీ అస్తమిస్తామవుతుందని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం రోజునకామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి రాజనర్సు మహిబూబ్ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, ఎన్ఎమ్ఆర్, ఫిక్స్ ధ్ఫే, తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందినందరినీ పర్మినెంట్ చేయాలని, రెండవ పిఆర్సి లో కనీస వేతనం రూ.26,000/- లుగా నిర్ణయించాలని, ఆలోపు ఆంధ్రప్రదేశ్లో ఇస్తున్నట్లుగా రూ.21,000/- ల వేతనం అమలు చేయాలని, కేటగిరీల వారిగా వేతనాలు ఇవ్వాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి ఈఎస్ఐ పీఎఫ్ లలో జరుగుతున్న అవకతవకలను నివారించాలని, కార్మికులందరికీ వారాంతపు సెలవులను మరియు లేబర్ డిపార్ట్మెంట్ ప్రతిపాదించిన జాతీయ సెలవులన్నింటిని కార్మికులందరికీ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో , కార్మికుల వయస్సు పైబడిన, అనారోగ్యానికి గురైన, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి వారసులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.పై సమస్యల పరిష్కారం కోరుతూ ఈరోజు, రేపు 48 గంటల పాటు మున్సిపాలిటీల ముందు దీక్షలు జనవరి 6వ తేదీన కలెక్టరేట్ ముట్టడికి కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మున్సిపల్ ప్రభాకర్ దీపక్ కాత్రియాల ప్రభు రాజేందర్ దీవెన శివరాజవ్వ కోటి ఎల్లవ్వ పోతారం లక్ష్మి జ్యోతి కార్మికులు విజయ్ సంతోష్ అంగల్లలక్ష్మి భూలక్ష్మి సులోచన తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం రాష్ట్ర నాలుగో మహాసభలు విజయవంతం చేయండి

## - జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

**సూర్య కామారెడ్డి**




కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం నాలుగో మహాసభల కరపత్రాలను విడుదల చేయడం జరిగింది .ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కే చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈనెల 25 నుండి 28వ తేదీ వరకు సంగారెడ్డి పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని ఆ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు రాష్ట్ర మహాసభల సందర్భంగా ఇంటింటికి సిపిఎం పేరుతో ఈ 20 రోజుల పాటు సిపిఎం కార్యకర్తలు ప్రతి ఒక్క ఇంటికి వెళ్తారని కావున ప్రజలు సహకరించాలని అన్నారు అదేవిధంగా ఈ రాష్ట్ర మహాసభలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చలు జరిపి వారి సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని కావున ప్రజలు ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకాట్ గౌడ్, మోతిరామ్ నాయక్, కొత్త నర్సింలు ,జిల్లా కమిటీ సభ్యులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

**సూర్య, బోధన్**



వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్.పి.ఆర్.డి నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 216 లూయిస్ బ్రెయిలీ ప్రపంచంలోనే అందులో విద్య అభివృద్ధి కోసం నిరంతరం కృషి ప్రత్యేక లిపిని కనిపెట్టిన అందుల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ, అందుల అక్షరం ప్రదాత లూయిస్ బ్రెయిలీ 2001వ జయంతి బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పటల్ ఆవరణములో జిల్లా అధ్యక్షుడు గైని రాములు అధ్యక్షతన నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ శాల గంగాధర్., మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి అనేకమంది చీకటి జీవితాల్లో వెలుగుని నింపినారు. వారిని ఆదర్శవంతంగా తీసుకొని నేడు ఉన్నటువంటి అందులు వికలాంగులు విద్యను నేర్చుకొని అనేక ప్రభుత్వ ఉద్యోగాలు ప్రైవేటు ఉద్యోగాలు సాధించి సమాజానికి సేవ చేస్తూ సకలంగులకు మేమేమి తక్కువ కాదని నిరూపించుకోవడం జరిగింది. వారి జీవితాన్ని ఆ రకంగా ఆదర్శవంతంగా తీసుకొని ప్రపంచంలోని మేధావులుగా అందులు వికలాంగులు తయారు కావాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నజీర్, జిల్లా సహాయ కార్యదర్శి ముంజ సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు గంపల శంకర్, పల్లికొండ చింటూ, నేహాల్, గంగారాం, పోచయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మండల గ్రంథాలయంకు మౌలిక వసుతులు కల్పించాలి అని బీజేపీ నాయకుల వినతి

**సూర్య,పెద్ద కోడప్ గల్**



మండల కేంద్రం లో నీ గ్రంథాలయం లో కనీస మౌలిక వసతులు కల్పించాలి అని బీజేపీ నాయకులు జిల్లా గ్రంధాలయ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డికి కలిసి వినిపించారు. శనివారం మండల కేంద్రానికి వచ్చిన జిల్లా గ్రంథాలయం చైర్మన్ ను మండల బిజెపి నాయకులు కలిసి గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు, దినపత్రికలు, అందుబాటులో లేవు కావున దీనిని పరిగణలలోకి తీసుకొని వసతులు కల్పించాలని కోరినారు. వెంటనే స్పందించిన జిల్లా చైర్మన్ వారం రోజుల్లోనే తనవంతు కృషి చేస్తానని మాట ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తానాజీ, సర్కొండవర్ రమేష్, తదితరులు పాలొగొన్నారు

# జనవరి 06 ఫ్రెండ్షిప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**సూర్య,పెద్ద కోడప్ గల్**

పెద్ద కోడప్ గల్ మండల కేంద్రం లో జనవరి 06 నా ఫ్రెండ్షిప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు నిర్ణయించిన నియమాలకు లోబడి టోర్నమెంట్ జరుగుతుందని తెలిపారు. టోర్నమెంట్లో మొదటి విజేతగా నిలిచిన వారికి 25,555/-, రెండో బహుమతిగా నిలిచిన వారికి 12,222/- అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్లో పాల్గొనేవారు. ఈ నంబర్లకు సంప్రదించి టీముల పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు 81060 48122,7093345325,8008871275,9912031221...

# ఉత్తమ ప్రతిభ కనబరిచిన లక్ష్మీనారాయణ

**సూర్య కామారెడ్డి**



రాష్ట్రస్థాయిలో 45ంవయసున్న వారికి నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.10 కిలోమీటర్ల రన్నింగ్ పోటీలో కామారెడ్డి జిల్లా తరపున ఉత్తమ ప్రతిభ కనబర్చిన గెరిగంటి లక్ష్మినారాయణ 11వ తెలంగాణ స్టేట్ నేషనల్ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ ఆత్లేంటిక్ చాంపియన్ షిప్ - 2025 పోటీల్లో భాగంగా ఈరోజు హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో భాగంగా ఈరోజు ఉదయం జరిగిన 10 కిలోమీటర్ల రన్నింగ్ పోటీలో పాల్గొన్న గెరిగంటి లక్ష్మినారాయణ కామారెడ్డి జిల్లా తరపున 45ం వయస్సు వారిలో 10 కిలోమీటర్ల దూరాన్ని 47 నిమిషాల్లో కంప్లీట్ చేసి రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న 33 జిల్లాల వారిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి 4వ స్థానంలో నిలిచారు

# ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఉద్యమించాల్సిన బాధ్యత మాదిగ విద్యార్థులదే

## - యం.ఎస్.యఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మెక్కా సాయి మాదిగ.

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



భారత అత్యున్నత న్యాయవ్యవస్థ సుప్రీంకోర్టు ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగ, మాదిగ ఉప కులాలను మోసం చేస్తున్నాడని, ఆ మోసకారి రేవంత్ ప్రభుత్వంపై ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మాదిగ విద్యార్థులు యుద్ధ సైనికులై ఉద్యమించాలని యం.ఎస్.యఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మెక్కా సాయి మాదిగ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ., ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలను భర్తీ చేస్తూ రేవంత్ రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే టీచర్ ఉద్యోగ నియామకాల్లో మాదిగ, మాదిగ ఉపకులాలు తీవ్రంగా నష్టపోయాయని, మళ్ళీ గ్రూప్ వన్, గ్రూప్ టూ, గ్రూప్ త్రీ, హాస్టల్స్ వార్డెన్ తదితర ఇతర ఉద్యోగ నియామకాల పరీక్షలు నిర్వహిస్తూ ఎస్సి కోటాలో ఉన్న ఉద్యోగాలను మాదిగలకు దక్కకుండా మాలలకు దోచిపెట్టే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు ద్రోహం చేస్తున్న రేవంత్ ప్రభుత్వం పై మాదిగ విద్యార్థులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని, మన ఉద్యోగాల కోసం, హక్కుల కోసం, భవిష్యత్తు కోసం యుద్ధ సైనికులుగా మారి వర్గీకరణను అమలు చేయించుకోవాలని కోరారు. ఎస్సీ వర్గీకరణను తక్షణమే రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ తీసుకునే ఉద్యమ కార్యాచరణకి విద్యార్థులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# అంగన్వాడీ కేంద్రం తనిఖీ

**సూర్య మాక్లూర్**



మండలంలోని చిక్లీ అంగన్వాడి కేంద్రం,ప్రాథమిక పాఠశాలలను ఎంపీఓ తోపారం శ్రీనివాస్ శని వారం తనిఖీ చేశారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సిబ్బంది,విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి నవీన్,కరోబారి సాయిలు,తదితరులు పాల్గొన్నారు

# నిజాం షుగర్స్ పునరుద్ధరణకు ప్రభుత్వం సానుకూలం

## - రైతుల అవగాహన సదస్సులో ఎమ్మెల్యేలు, కేన్ కమిషనర్ వెల్లడి
## - చెరకు సాగుకు ముందుకు రావాలని పిలుపు

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



చెరకు రైతుల చిరకాల వాంఛ అయిన నిజాం చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, షుగర్ కేన్ కమిషనర్ మల్సూర్ వెల్లడించారు. నిజాం షుగర్స్ ను పునః ప్రారంభించే చర్యల్లో భాగంగా శనివారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి శివారులోని సరయు ఫంక్షన్ హాల్ లో స్థానిక శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో ఫ్యాక్టరీ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన చెరకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యేలతో పాటు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర రావు తదితరులు సదస్సులో భాగస్వాములయ్యారు. చెరకు సాగుకు స్థానికంగా గల అనువైన పరిస్థితులు, చెరకు పంటతో సమకూరే లాభాలు, అందుబాటులోకి వచ్చిన ఆధునిక యంత్ర పరికరాలు, అధిక దిగుబడిని అందించే వంగడాలు, చెరకు సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు తదితర విషయాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, విజయ్ కుమార్ తదితరులు రైతులకు అవగాహన కల్పించారు. దశాబ్ద కాలం క్రితం వరకు కూడా కొనసాగిన నిజాం షుగర్స్ వివిధ కారణాల వల్ల 2015 నుండి మూతపడగా, ఈ కర్మాగారాన్ని తిరిగి తెరిపించి క్రషింగ్ చేపట్టాలంటే ప్రతిరోజూ కనీసం 3500 మెట్రిక్ టన్నుల చెరకు నిల్వలు అవసరం అవుతాయని, ఏడాదిలో 130 రోజుల వరకు గానుగ ఆడించాల్సి ఉంటుందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు చెరకు సాగుకు ముందుకు వస్తే ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని భరోసా కల్పించారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని పునరుద్ధరింపజేసేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నామని అన్నారు. ఈ ప్రాంత రైతుల ప్రయోజనాల కోసం నిజాం షుగర్స్ ను తెరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముఖ్యమంత్రికి సూచించగా, సీఎం సానుకూల వైఖరితో అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ఫ్యాక్టరీకి సంబంధించి పెండింగ్ లో ఉన్న సుమారు 190 కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. చెరకు పంట సాగుకు రైతులు సంసిద్ధత తెలిపితే, కర్మాగారాన్ని తెరిపించి నిజాం షుగర్స్ కు పూర్వ వైభవం చేకూరుస్తామని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని స్పష్టం చేశారు. చెరకు ఫ్యాక్టరీకి అనుబంధంగా ఉన్న డిస్టిల్లరీ యూనిట్ ను కూడా తెరిపించాలని ధృడ సంకల్పంతో ముందుకెళు తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇప్పటికే ఫ్యాక్టరీ పునరుద్ధరణ చేసేందుకు ఎన్ని నిధులు వెచ్చించాల్సి వస్తుందనే దానిపై అధికారులు ప్రాథమికంగా అంచనాలు రూపొందించారని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, రైతులు సంప్రదాయంగా వస్తున్న వరి పంటకు ప్రత్యామ్నాయంగా అధిక లాభాలను అందించే చెరకు పంటను సాగు చేయాలని సూచించారు. ఆధునిక యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చి సాగు ఖర్చులు గణనీయంగా తగ్గించుకునే వెసులుబాటు ఉందని, అధిక దిగుబడులను అందించే వంగడాలను విత్తుకుని సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే ముమ్మాటికీ చెరుకు లాభసాటి పంట అని అన్నారు. షుగర్ కేన్ కమిషనర్ మల్సూర్ మాట్లాడుతూ, రైతుల కోరిక మేరకు నిజాం షుగర్స్ పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం సానుకూల వైఖరితో ముందుకెళ్తోందని అన్నారు. ఈ దిశగా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కూడిన కమిటీని నియమించగా, ఇటీవలే కమిటీ క్షేత్రస్థాయి సందర్శన జరిపిందని గుర్తు చేశారు. అంతేకాకుండా ప్రభుత్వం సుమారు 190 కోట్ల రూపాయల బకాయిలను కూడా చెల్లించిందని అన్నారు. అయితే కనీసం 16 వేల నుండి 18 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు పంటను సాగు చేస్తే ఫ్యాక్టరీలో క్రషింగ్ జరపవచ్చుని సూచించారు. చెరకు సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం తరపున సబ్సిడీపై విత్తనాలను సమకూర్చడంతో పాటు అన్ని విధాలుగా తోడ్పడును అందిస్తామని అన్నారు. ఫ్యాక్టరీ పరిధిలోని ఆయా గ్రామాల రైతుల నుండి చెరకు పంట సాగు చేసే విషయమై అభిప్రాయాలను సేకరించి, స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్లాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, చెరకు పంట సాగు పై రైతుల అభిప్రాయాలను తెలుసుకుని, ప్రభుత్వం నుండి వారు ఏమి ఆశిస్తున్నారనే విషయాలను తెలుసుకునేందుకు వీలుగా ఈ సదస్సు నిర్వహించడం జరిగిందని అన్నారు. కాగా, ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలతో పాటు సకాలంలో బిల్లుల చెల్లింపులపై స్పష్టమైన హామీ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం అందించే ఇన్సెంటివ్ కు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రోత్సాహకాన్ని జోడించి ఇవ్వాలని, డ్రిప్ పరికరాలు, హార్వెస్టర్లు, సోలార్ ఫెన్సింగ్, ఇతర ఆధునిక యంత్ర పరికరాలకు సబ్సిడీని వర్తింపజేయాలని ఈ సందర్భంగా రైతులు కోరారు. ఈ సదస్సులో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, సంబంధిత శాఖల అధికారులు, అధిక సంఖ్యలో చెరకు రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

**సూర్య, లింగంపేట్**




లింగంపేట్ మండలంలోని కొయ్య గుండు తండా, ముస్తాపూర్ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే సక్రమంగా చేశారా లేదా అని పరిశీలించామని పేర్కొన్నారు. వీరి వెంట గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీవో సభ్యులు

**సూర్య, భీమ్‌గల్**



నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును భీమ్‌గల్ టీఎన్జీవో యూనిట్ అధ్యక్షుడు కుంట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పురస్తు నరేష్ కలెక్టర్ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి,నోట్ బుక్స్ లను అందజేశారు.అనంతరం టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ ని జిల్లా కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు మణిక్యం,ఏడేల్లి రవి పాల్గొన్నారు.

## సంవిధాన్ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయండి

**- రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీయొద్దిన్**

**సూర్య, లింగంపేట్**



నేడు హైదరాబాద్ లోని కులీ కుతుబ్షా గ్రౌండ్ లో నిర్వహిస్తున్న సంవిధాన్ నిరసన ప్రదర్శన సమావేశాన్ని విజయవంతం చేయాలని టిపిసిసి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీయొద్దిన్ పిలుపునిచ్చారు.ఆయన శనివారం లింగంపేట్ మండల విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యసభలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానించి మాట్లాడిన సందర్భంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధివిదానాలవల్ల, మైనార్టీ, దళితులు, బడుగు బలహీన వర్గాలపై అత్యాచార సంఘటనలు తీవ్రంగా పెరుగుతున్నందున ఈ సమావేశం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.ఇట్టి సమావేశానికి ఆల్ ఇండియా మైనార్టీ చైర్మన్ ప్రముఖ కవి ఇమ్రాన్ ప్రతాప్,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,ముఖ్య అతిథిలుగా పాల్గొంటరన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లు,దళిత మైనార్టీల రాష్ట్ర అధ్యక్షులు హాజరుకానున్నారన్నారు.ఇట్టి నిరసన ప్రదర్శనను బడుగు బలహీన వర్గాలు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,నాయకులు,భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


## గిడ్డంగిలు ప్రారంభించనున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**సూర్య, లింగంపేట్**

మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బినోల పరిధిలో గల నాళేశ్వర్, లింగాపూర్ గ్రామాలలో నిర్మించిన ఎరువుల గిడ్డంగిలను స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా ఈరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు జంగిటి రాంచందర్ తెలిపారు.

## లింగారెడ్డిపేట్ పాఠశాల విద్యార్థులకు, లైబ్రరీ పుస్తకాలకు బీరువా వితరణ

**సూర్య ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి పట్టణంలోని లింగారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో, ఉపాధ్యాయుడుగా మొట్టమొదటిసారి వృత్తిని చేపట్టిన ప్రధానోపాధ్యాయుడు ముప్పవరపు ఉమా కాంతారావు, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, గత కొద్ది రోజుల్లోనే తన పదవి విరమణ ఉండడంతో, శనివారం ఎల్లారెడ్డి పట్టణంలోని లింగారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తన వంతుగా లైబ్రరీ పుస్తకాలు భద్రపరచుకొనుటకు తాను మొదటిసారి విద్యార్థిని విద్యార్థులకు పాటలు నేర్పిన పాఠశాలకు తన వంతుగా ఏదో చేయాలని తపనతో శనివారం లింగారెడ్డిపేట పాఠశాలకు 9000 రూపాయల గల బీరువాను ఉచితంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తను పదవి బాధ్యతలు చేపట్టిన ఆరోజుల్లో లింగారెడ్డి పెట్టి గ్రామంలో పాఠశాల పరి



స్థితులు అత్యంత ఘోరంగా ఉండేవని ఒకసారి తలుచుకుని బాధపడ్డాడు అప్పటికి ఇప్పటికీ పరిస్థితులు చాలా మార్పు వచ్చిందని పాఠశాలను లింగారెడ్డిపేట గ్రామస్తులు ఒక కమిటీగా మారి పాఠశాలను అభివృద్ధి పరిచారని చుట్టూ పూల చెట్లు పక్కనే పల్లె ప్రకృతి వనం చూస్తుంటే మారిపోయిన వాతావరణ ఒక్కసారి , నేటి విద్యార్థులకు పాఠశాల అనుకూలంగా మారిందని, ప్రతి విద్యార్థి ఉన్నతమైన విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాలు చేయాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాశిరం, రామకృష్ణ, ఉమాదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో నివాసపు గుడిసే దగ్ధం

**సూర్య కామారెడ్డి**



కామారెడ్డి జిల్లాలో ఓ నివాసపు గుడిసె దగ్ధమైంది. గుడిసెలో ఉన్న ఆరు నెలల దూడ కూడా మృతి చెందింది. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాపాల్వంచ మండలం మంథని దేవునిపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ అగ్ని ప్రమాదంలో మంథని దేవునిపల్లి గ్రామానికి చెందిన కామటి రాజవ్వ నివాసపు గుడిసె ప్రమాదవశాత్తు అంటుకుంది. అయితే ఆ సమయంలో రాజవ్వ ఫంక్షన్ నిమిత్తం గ్రామంలోనే ఉంటున్న కూతురు ఇంటి వద్ద ఉంది. ఇంటినుంచి వెళ్తున్నప్పుడు గేదెను బయట కట్టేసి 6 నెలల దూడను ఇంట్లో ఉంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో దూడ మృతి చెందింది. రాజవ్వ ఇంట్లో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బందికి గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదం అనుకోకుండా జరిగిందా లేక ఎవరైనా కావాలని చేసారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం సంఘటన స్థలానికి పాల్వంచ మండల తాసిల్దార్ అగ్నిమాపక అధికారులు పంచనామా నిర్వహించారు. సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని బాధితురాలు రాజవ్వ అధికారులను కోరారు. బియ్యము, బట్టలు, బాధితురాలికి వెయ్యి రూపాయల నగదు అధికారులు అందజేశారు. గుడి నివాసపు గుడిసెలో ఉన్న వంట సామాగ్రి బట్టలు అన్ని ఖాళీ బూడిద అయినట్లు బాధితురాలు రోదిస్తూ అధికారులకు వివరించింది. ఇల్లు మంజూరుకు ప్రతిపాదనలను పంపిస్తామని బాధితురాలికి అధికారులు హామీ ఇచ్చారు.

## కామారెడ్డి జిల్లాలో విస్తృతంగా జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

**- రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి**

**సూర్య కామారెడ్డి**



జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లాలోని న్యూటన్ పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం జరిగిందని ఏ ఎం వి ఐ మహేష్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శాంతి నికేతన్ విద్యా సంస్థలో, జడ్పిహెచ్ఎస్ మద్నూర్ పాఠశాలలో, జడ్.పి.హెచ్.ఎస్ మాచారెడ్డి రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరిగిందని ఏఎంవిఐ అధికారిని నాగ లక్ష్మి,రజనీబాయి,ఏ ఎం వి ఐ సురేష్ టాస్క్ ఫోర్స్ కానిస్టేబుళ్లు హెూంగార్డ్స్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ చేసిన సిబ్బందికి వీడ్కోళ్ళు..

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**





నిజామాబాద్ పోలీస్ శాఖలో డిసెంబర్ 31న లి"పదవి విరమణలి " చేయడం జరిగిన నేపద్యంలోని వారి వివరాలుడిసెంబర్ నెలలో పదవి విరమణ చేసిన సిబ్బంది
1. జి.శ్రీనివాస్ రావ్, ఎస్.ఐ, స్పెషల్ బ్రాంచ్, నిజామాబాద్ పోలీస్ శాఖలో (39) సం?ల సర్వీసు పూర్తి చేసి " పదవి విరమణ " పొందినారు. 2. కె. నర్సయ్య, ఎస్. ఐ. టౌన్ 3 పి.యస్ నిజామాబాద్ పోలీస్ శాఖలో (36) సం?ల సర్వీసు పూర్తి చేసి " పదవి విరమణ " పొందినారు. 3. జె. రామారావు, ఎస్.ఐ నిజామాబాద్ రూరల్ పి.యస్, నిజామాబాద్ పోలీస్ శాఖలో (43) సం?ల సర్వీసు పూర్తి చేసి " పదవి విరమణ " పొందినారు. 4. మహ్మద్ ఆరీఫ్ ఉద్దీన్ ఎస్.ఐ మహిళా పోలీస్ స్టేషన్, నిజామాబాద్ పోలీస్ శాఖలో (41) సం?ల సర్వీసు పూర్తి చేసి " పదవి విరమణ " పొందినారు. 5. అబ్దుల్ సలీం, ఎ.ఆర్.ఎస్.ఐ, పోలీస్ హెడ్క్వార్టర్స్, నిజామాబాద్ పోలీస్ శాఖలో (41) సం?ల సర్వీసు పూర్తి చేసి " పదవి విరమణ " పొందినారులి.
6. మహ్మద్ సలీమ్ ఉద్దీన్, ఎ.ఆర్.ఎస్.ఐ, పోలీస్ హెడ్ క్వార్టర్స్, నిజామాబాద్ పోలీస్ శాఖలో (34) సం?ల సర్వీసు పూర్తి చేసి " పదవి విరమణ " పొందినారు. 7. జి. నాగరాజు, హోమ్ గార్డు నెంబర్ 199, నార్త్ రూరల్ సి.ఐ కార్యాలయంలో (33 ) సంఎల సర్వీసు పూర్తి చేసి "పదవి విరమణ" పొందినారు. నేడు వీరి " లిపదవి విరమణలి" వీడ్కోలు కార్యాక్రమం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వ హించడం జరిగింది. లివీరికి శాలువలతో సత్కరించి" పదవి విరమణ శుభాకాంక్షలు సర్టిఫికేటు(జ్ఞాపికలతో) " ఘనంగా సత్కరించడం జరిగినది. ఈ సందర్భంగా లినిజామాబాద్ అదనపు డి.సి.పి (అడ్మిన్) జి.బస్వారెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎంతో పనివత్తిడితో విధులు నిర్వహించి, ఎలాంటిరిమార్కు లేకుండాపదవి విరమణ చేయడం ఎంతో గోప్ప విషయమని, ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పక ఉంటుందని మీరు డిపార్టుమెంటల్ కు చేసిన సేవలు ఎంతో ఘననీయమని పదవి విరమణ అనంతరము మీకు ఎలాంటి అవసరం వచ్చిన మీకు ఎల్లవేళల సహాయపడుతామని, మీరు మరియు మీ కుటుంబ సభ్యులు అయురారోగ్యాలతో ఉండాలని, మీ పిల్లల భవిష్యత్తుభాగుండాలని ఆకాంక్షించారు. ఈ వీడ్కోళ్లు సందర్భంగా లిస్పెషల్ బ్రాంచ్ ఎ.సి.పి ఎస్. శ్రీనివాస్ రావ్, పోలీస్ కార్యాలయం ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, బషీర్., స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, రిజర్వు ఇన్స్ పెక్టర్స్ శ్రీనివాస్, తిరుపతి, శేఖర్ ఃవారికుటుంబ సభ్యులు హాజరుకావడం జరిగింది.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయ్యాలి అని మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం అందించిన కార్మికులు

**- సిఐటియు, రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు**

**సూర్య ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి మున్సిపల్ కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా శని వారం,అది వారం లో మున్సిపల్ ఆఫీసు ముందు 48 గంటల దీక్షలు చేపట్టారు అనంతరం మున్సిపల్ చైర్మన్ కు మున్సిపల్ కార్మికులు వినతి పత్రం అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన చలో కలెక్టర్ ఆఫీస్ ముట్టడి ఉంటుందని న్యాయమైన డిమాండ్ పర్మిట్ చేయాలని 26 వేల రూపాయలు ఇవ్వాలని పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్లో ఇస్తున్న విధంగా 21000 మన రాష్ట్రంలో కూడా ఇవ్వాలని కోరారు ఎల్లారెడ్డి మున్సిపల్ లో బకాయి ప్రావిడెంట్ ఫండ్ ,ఈఎస్ఐ, డబ్బులు కార్మికుల ఆకౌంట్లో జమ చేయాలని కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ కార్మికులకు డబుల్ బెడ్ రూములు ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు మున్సిపల్ కార్మికులకు రిటర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు ఇవ్వాలని మున్సిపల్ కార్మికుడు మరణిస్తే వారి స్థానంలో వారి కుటుంబం లో ఒకరికి స్థానం కల్పించాలని ఆ కుటుంబానికి 10 లక్షలు ఎక్సిషియా తో పాటు ఖర్చులు 30000 రూపాయలు ఇవ్వాలని ,న్యాయమేనా సమస్యల పైన మున్సిపల్ కార్మికుల పెండింగ్ ఈపీఎఫ్ , ఈ ఎస్ టి ,పెండింగ్ డబ్బులు కార్మికుల అకౌంట్లో జమ కావాలని మున్సిపల్ కార్మికులకు క్యాటగిరి వారిగా జీవో నెం 60 ప్రకారం పెరిగిన జీతాలు ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఆఫీస్ ముందు దీక్షలు ఉంటాయని ప్రభుత్వం స్పందించకుంటే 6వ తేదీన కలెక్టర్ ఆఫీస్ ముందు దర్నా కార్యక్రమం ఉంటుందని జనవరి 27 తర్వాత మున్సిపల్ కార్మికులను పర్మెంటు చేయాలని కనీస వేతనాలు 26 వేల రూపాయలు, ఇవ్వాలని ఈ సందర్భంగా అన్నారు, ఈ న్యాయమైన కోరికలు పరిష్కారం కాకపోతే సమ్మెలకు పోతామని వారు తెలియజేశారు.

## రైతు బిడ్డకు ఫైర్ మాన్‌గా ఉద్యోగం

**-మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా అపాయింట్మెంట్ ఆర్డర్**

**సూర్య,లింగంపేట్**



ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేసే రైతు బిడ్డకు ఉద్యోగం వరించింది. వివరాల్లోకి వెళితే లింగంపేట్ మండలంలోని భవానిపేట గ్రామానికి చెందిన రైతు చాకలి గోపాల్,గంగవ్వల ప్రధమ కుమారుడు చాకలి రాజు శనివారం హైదరాబాదులోని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఫైర్ మేన్ జాబ్ అపార్ట్మెంట్ ఆర్డర్ అందుకున్నారు. సంవత్సరం క్రితం ప్రవేశపెట్టిన ఉద్యోగాల్లో ఎగ్జామ్ రాశాడు ఎంపికైన చాకలి రాజు నాలుగు నెలల ట్రైనింగ్ తీసుకొని మంత్రి చేతుల మీదుగా ఉద్యోగ నియాగమాపకత్ర పత్రం అందుకున్నారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో ఉద్యోగంలో చేరనున్నాడు అతనిని గ్రామస్తులు పలువురు అభినందించారు.

## రాష్ట్ర కబడ్డీ జట్టు కు ఎంపికయినా అనిల్

**సూర్య నిజామాబాద్ రూరల్**



ఇటీవల జనగామలో తేదీ 27 నుండి 30 డిసెంబర్2024 సంవత్సరంలో జరిగిన 50వ అండర్ 20 బాలుర ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్షిప్ లో చక్కని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో స్థానం సంపాదించిన అనిల్‌ను నిజాం బాద్ జిల్లా కబడ్డీ సంఘం ప్రెసిడెంట్ ఏ లింగయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధర్ రెడ్డి ట్రెజరర్ సురేందర్, ఉపాధ్యక్షులు సుబ్బారావు, బొబ్బిలి నరసయ్య సీనియర్ జాతీయ క్రీడాకారులు శ్రవణ్ రెడ్డి, కబడ్డీ కోచ్ ప్రశాంత్, రాజ్ కుమార్,రాజేందర్, గజల్లాల్, వినోద్,గంగారెడ్డి, శశాంక్ తదితరులు అభినందించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష,, కార్యదర్శులు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా జట్టు నుండి జాతీయస్థాయి పోటీల్లో ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

## ఉరి వేసుకొని యువకుడు మృతి

**సూర్య, లింగంపేట్**



అనారోగ్యంతో బాదపడుతూ ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లింగంపేట్ మండలంలోని ఐలాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి గ్రామానికి చెందిన పొట్టి వారి రామస్వామి 28 అనే యువకుడు గత కొంతకాలంగా తీవ్రమైన నడుము నొప్పితో బాధపడుతున్నాడని ఆర్థిక పరిస్థితి బాగాలేక పోవడంతో పెద్ద ఆస్పత్రిలో చూపెట్టు కోలేదన్నారు. ఈనెల 3 న రామస్వామి భార్య విజయ వ్యవసాయ కూలీ పనికి వెల్లిందని భర్త ఇంటి వద్దనే ఉన్నాడు నడుము నొప్పు భరించలేక జీవితంపై విరక్తి చెంది అదేరోజు సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని రామస్వామి మృతి చెందాడన్నారు. ఇంట్లోకి వెళ్లి తల్లి చూడగా ఉరి వేసుకుని కుమారుడు కనిపించినట్లు తెలిపారు. మృతుని భార్య విజయ దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడమైనదని ఎస్సై పేర్కొన్నారు. మృతునికి ఒక కూతురు,కొడుకు కలరన్నారు.

## బహిరంగ సభకు మైనార్టీలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపు.

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి**




కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 26 నుండి జనవరి 26 వరకు సంవి ధాన్ బచావో ఆందోళన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మైనార్టీ శాఖ పిలుపు మేరకు ఆదివారం హైదరాబాదులోని కులీ కుతుబ్షా గ్రౌండ్ లో జరిగే బహి రంగ సభకు ఆల్ ఇండియా మైనార్టీ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్ ఘాడీ అధ్యక్షతన నిర్వహించే బహిరంగ సభకు జిల్లాలోని మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాని విజయవంతం చేయాలని జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖలేఖ్ అన్నారు. శనివారం బాన్సువాడ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ., జిల్లా నుండి అధిక సంఖ్యలో మైనార్టీలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అసద్ బీన్ మోసిన్, షాహబ్,మండల మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్ నబీ, వహాబ్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు అఫ్రోజ్, కమురుద్దీన్, అజీమ్ మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.

## 7న బాన్సువాడ కి రానున్న ఎక్సైజ్ ,పర్యాటక శాఖ మంత్రి

**- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పోచారం**

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి -**



ఈనెల 7వ తేది మంగళవారం రోజున కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ కార్యాలయం ప్రారంభోత్సవానికి మరియు అమృత్ 2.0 లో భాగంగా బాన్సువాడ పట్టణంలో మంచినీటి సరఫరా పనుల శంకుస్థాపన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ కార్యాలయం, అమృత్ 2.0 శంఖుస్థాపన ఏర్పాట్లను మరియు సభాస్థలాన్ని బాన్సువాడ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో పట్టణ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఎక్సైజ్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## చెరుకు పంట వేసి జిల్లాలో గత ప్రభావాన్ని తీసుకురావాలి

**- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి**

**సూర్య, బోధన్**



చెరుకు పంట నిజామాబాద్ జిల్లాలో వేసి గత ప్రభావం తీసుకురావాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం బోధన్ నియోజకవర్గం ఎడపల్లి మండల కేంద్రంలో చెరకు రైతుల విస్తృత స్థాయి చెరకు రైతుల అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. బోధన్ లోని శంకర్ నగర్ లో ఉన్న చక్కెర కర్మాగారం గతంలో ఆసియా ఖండంలోనే పేరు గడించిందని మళ్లీ ఆ స్థాయికి చేరుకోవాలని అన్నారు. చెరుకు పంటతో అధిక దిగుబడును సాధించి రైతులు అధిక ప్రయోజనాలు పొందాలని సూచించారు. రాష్ట్ర చెరుకు రైతు సంచాలకులు మన్సూర్ మాట్లాడుతూ... గతంలో బోధన ప్రాంతంలో ఏడు మండలాల్లో ఏడు మండలాల్లో 85 గ్రామాలలో 16 వేల ఎకరాలలో చెరుకు పంట పండించారని అదే స్పూర్తితో రైతులు ముందడుగు వేసి చెరుకు పంటపై దృష్టి సాధించాలని అన్నారు. ప్రస్తుతం మూస పద్ధతిలో కాకుండా ఆధునిక పద్ధతులతో, పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో రెండింతల దిగుబడి సాధించవచ్చని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... చక్కెర ఫ్యాక్టరీ తెరచు కోవడమే కాకుండా అందుకు తగ్గ వనరులను, సదుపాయాలను, ప్రభుత్వం కల్పించాల్సి ఉందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, నాయకులు మానాల మోహన్ రెడ్డి, పులి శ్రీనివాస్, రామ్మోహన్ ,రజిత యాదవ్, నారాయణ చౌదరి, ఇలాంటి లింగం, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## బాన్సువాడ సబ్ రిజిస్ట్రార్ మృతి

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి -**



కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ డేవిడ్ రజినీష్ (45) మృతి చెందారు. సాయంత్రం విధులు ముగించుకుని బోధన్‌లోని ఇంటికి వెళ్లిన అనంతరం బాత్‌రూంలో కాలు జారిపడ్డారు. తీవ్ర గాయలపైన ఆయన్ను నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. రజనీష్ మృతి పట్ల రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.